

18న ప్రజాఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమం సార్వతిక ఎన్నికల కోడ్ అమలుతో వాయిదా వేశారు. ఎన్నికల ముగిసిన తరువాత ఈనెల 18వ తేదీ స్పందన కార్యక్రమం పేరు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక పేరుతో మార్పు చేసి ఈనెల 18వ తేది సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుండీ మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

పెద్దిరెడ్డి గో బ్యాక్

- పుంగరూరులో ఉద్రిక్తత
- మాజీ ముడా ఛైర్మన్ ఇంటిపై రాళ్ల దాడి
- టిడిపి నాయకుల ర్యాలీ, రాస్తారోకో



పుంగనూరులో రాస్తారోకో చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పుంగనూరు: మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు పర్యటన ఉద్రిక్తంగా మారింది. పెద్దిరెడ్డి గో బ్యాక్ అంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు నినాదాలతో పుంగనూరు హోరెత్తించారు. శనివారం టిడిపి నాయకులు స్థానిక అంబేద్కర్ సర్కిల్‌కు భారీగా చేరుకున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైసీపీ నాయకులతో సమీక్షా సమావేశాన్ని జడ్పీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేస్తున్నారని వాట్సాప్ గ్రూపులో రావడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం వర్గీయులు కార్యక్రమాన్ని అడ్డుకోవాలని, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పుంగనూరులో అడుగుపెట్టనివ్వమని ఉదయం నుంచి మాట్లాడుకోవడం జరిగింది. దీంతో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌కు రూరల్, అర్బన్ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. పెద్దిరెడ్డి గో బ్యాక్.., పెద్దిరెడ్డి రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, టిడిపి రూరల్ అధ్యక్షులు మాధవరెడ్డిలు మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు నాయుడును రానివ్వకుండా అడ్డుకున్నారని ఇప్పుడు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని పెద్దిరెడ్డిని పుంగనూరు నియోజకవర్గంలో తిరగనివ్వమని హెచ్చరికలు చేశారు. వారు అధికారంలో ఉన్నప్పుడు చేసిన దౌర్జన్యాలు, రౌడీయిజం పెద్దిరెడ్డి రాజ్యాంగం మాత్రమే పుంగనూరు నియోజకవర్గంలో నడిచిందని, ఇప్పుడు వాటికి కాలం చెల్లిందన్నారు. ఇకపై వారి ఆటలు సాగనివ్వమని అడుగడుగునా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న మాజీ ముడా చైర్మన్ ఎన్.వెంకట్ రెడ్డి యాదవ్ ఇంటిపై టిడిపి నాయకులు రాళ్ల దాడి చేశారు. వారి ఇంటిలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపు చేశారు. కార్యక్రమంలో నాయకులు సివిరెడ్డి, పోలీస్ గిరి, చిన్న మోహన్ నాయుడు, మాజీ కౌన్సిలర్ దేశాల ప్రకాష్, కుమార్, స్వామి, సుబ్రహ్మణ్యం రాజు, మాజీ ఎంపీటీసీ గంగులప్ప పాల్గొన్నారు.

ఇది ప్రజాస్వామ్యమా..రాక్షస పాలన..

మాజీ ముడా ఛైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్

పుంగనూరులో ప్రజాస్వామ్య పద్ధతితో ఉన్నారా.. లేక రాక్షస పాలన కొనసాగుతున్నదా, కక్ష సాధింపు చర్యలు ఏమైనా చేస్తున్నారా అంటూ మాజీ ముడా చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యకర్తలు చేపట్టిన పెద్దిరెడ్డి గో బ్యాక్ కార్యక్రమంలో భాగంగా మాజీ ముడా చైర్మన్ ఇంటిపై రాళ్లు దాడి చేశారు. దీనిపై ఆయన మీడియాతో మాట్లాడుతూ తీవ్రఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. స్టేషన్ ఎదుటనే ఇలాంటి దాడులు చేస్తుంటే ఇక పట్టణంలో ఎలాంటి దాడులు చేస్తారా ప్రజలే ఆలోచించాలన్నారు. న్యాయవాదులైన నవీన్ కుమార్, రమణ యాదవులు టిడిపి కార్యకర్తలు రెచ్చగొట్టి తమపై దాడికి ఉసిగొల్పారని ఆరోపించారు. రాళ్ల దాడే కాకుండా రాడ్లు తీసుకుని మమ్ములను చంపడానికే ప్రయత్నించారని చెప్పారు. వారిపై పోలీసులు ఫిర్యాదు చేస్తున్నామని దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించాలి: సిపిఐ

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో గత పాలకులు అవలంభించిన అరాచక పద్ధతులను కొనసాగించాలనే దుష్ట ఆలోచనలు సరికాదని, దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ టి.జనార్దన్, పుంగనూరు పట్టణ కార్యదర్శి కే.రామ్మూర్తి పేర్కొన్నారు. వారు మీడియాతో మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ప్రజాతంత్రబద్ధంగా వ్యవహరిస్తామని పదేపదే చెబుతున్నా అందుకు భిన్నంగా పుంగనూరులో ప్రతిపక్ష పార్టీ నేతలపై దౌర్జన్యం, ఇండ్లపైన దాడులు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

ఇక ఎన్‌టిఆర్ భరోసా..

- పింఛన్ల పంపిణీ పై అధికారుల కసరత్తు
- జూలైలో ఒకేసారి మూడు నెలల నగదు
- పెంచిన వెయ్యితో కలిపి రూ. 7వేలు అందజేత

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

గత ప్రభుత్వ వైఎస్ఆర్ సామాజిక పింఛన్ పేరు మారనుంది. జూలై నెల నుంచి ఎన్‌టిఆర్ భరోసా పేరుతో కొనసాగనుంది. ఎన్నికల మ్యానిపెస్టోలో ప్రకటించిన విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజున పింఛన్ రూ.1000లు పెంచుతున్నట్లు తొలిసంతకం చేశారు.

గత ప్రభుత్వంలో మూడువేల రూపాయలున్న పింఛన్ రూ.4వేలుగా వెయ్యి పెంచి ఏప్రిల్ నెల నుండీ అమలు కానుంది. ఏప్రిల్, మే, జూన్ నెలలో పెరిగిన వెయ్యి రూపాయల పెన్షన్ కలిపి వృద్ధులు, వితంతువుల, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, మత్స్య, చర్మకారులు, డప్పు కళాకారులు, కల్లుగీత కార్మికులు, హిజ్రాలు, హెచ్ఐవి బాధితులకు రూ.4వేలు పింఛన్ అందనుంది.

జిల్లాలో మొత్తం 2,73,751

గత వైఎస్సార్‌సిపీ ప్రభుత్వం వివిధ రకాల సామాజిక పింఛన్లు రూ.2,73,751 నెలకు మూడు వేల చొప్పున పంపిణీ చేస్తోంది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం జూలై మాసం పెన్షన్ గత ప్రభుత్వం అర్హులుగా గుర్తించిన వారందరీ పంపిణీ చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వ అధికారులు జూలై మాసం సామాజిక పెన్షన్ పంపిణీకి కసరత్తు చేస్తున్నారు. మండలాల వారీగా చూస్తే ఏప్రిల్ నాటికి నగరి మున్సిపాలిటి 7,96, చిత్తూరు మున్సిపాలిటి 16,698, పలమనేరు మున్సిపాలిటి 4,707, నగరి 5,689, విజయపురం 5,211, బైరెడ్డిపల్లి 7,893, చౌడేపల్లి 6,742, గుడిపాల 7,049, రొంపిచర్ల 4,789, కార్వేటినగరం 7,205, పుంగనూరు 6,391, ఎస్ఆర్‌పురం 6,487, నింద్ర 4,783, పెద్దపంజాని 8,398, పాలసముద్రం 3,766, బంగారుపాళ్యం 12,232, ఐరాల 1,0065, జీడి నెల్లూరు 11,190, వెదురుకుప్పం 8,229, పులిచర్ల 6,953, తవణంపల్లి 9,878, పుంగనూరు మున్సిపాలిటి 5,562, రామకుప్పం 8,789, శాంతిపురం 8,321, గుడిపాల 5,799, సోమల 5,980, పూతలపట్టు 8,473, పలమనేరు 4,616, సోమల 7,409, యాదిమరి 7,771, చిత్తూరు 4,692, గంగవరం 8,397, కుప్పం 14,843, పెనుమూరు 7,373, వికోట 11,461 మంది సామాజిక పింఛన్లు పొందున్న లబ్ధిదారులున్నారు.

పింఛన్ల పంపిణీ పై కసరత్తు


జూలై ఒకటో తేదీ దగ్గర పడుతుండటంతో ప్రభుత్వ అధికాలు పింఛన్ పంపిణీపై కసరత్తు చేస్తున్నారు. గత ప్రభుత్వం సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా ప్రతినెలా ఒకటో తారీకున లబ్ధిదార్ల నివాసాల వద్దకు వెళ్ళి పంపిణీ చేసేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ తరువాత వలంటీర్ల ద్వారా పెన్షన్ పంపిణీ ఎన్నికల కమిషన్ నిలిపి వేయడంతో సామాజిక పింఛన్ల లబ్ధిదారుల్లో కొందరికి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేశారు. మరికొందరికి ప్రభుత్వం అధికారుల ద్వారా (సచివాలయ సిబ్బంది) నేరుగా అందజేశారు.



అయితే వలంటీర్లు దాదాపు అందరూ మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. గత ప్రభుత్వం నియమించిన సచివాలయ సిబ్బందని కొనసాగిస్తారా.. రద్దు చేస్తారా.. అనే విషయం తేలాల్సి ఉంది. ఏది ఏమైనా జూలై మాసం పెన్షన్ లబ్ధిదార్లకు నేరుగా ఇండ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేస్తారా.. లేక బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారా వేచిచూడాలి.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై
ఎమ్మెల్యేకు సిఐటియు వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్పొరేషన్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని శనివారం చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్‌కి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా నూతనంగా గెలిచిన శాసనసభ్యులకు పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ చిత్తూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు సమస్యలు పరిష్కారం చేయాలని గతంలో అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన సమస్యలు పరిష్కారం కాలేదని వాటిపై దష్టి పెట్టి సమస్యలు పరిష్కారానికి కషి చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచడంతోపాటు వారికి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారానికి కషిచేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ ప్రధానకార్యదర్శి విజయ్ కుమార్, నాయకులు నాగరాజు, లోకనాథం, సుబ్రహ్మణ్యం, సాయి, భూపతి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలియజేస్తున్న సిఐటియు జిల్లా నాయకులు గంగరాజు

చిత్తూరును క్లీన్ సిటీగా చేద్దాం..

పారిశుద్ధ్యంపై ఎమ్మెల్యే గురజాల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరాన్ని క్లీన్ సిటీగా చేద్దామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం నగరంలో 42వ వార్డు, వన్నియర్ బ్లాక్, 44 రంగాచారి వీధి వార్డుల్లో ఆకస్మికంగా పర్యటించి డ్రైనేజీ కాలువలు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ, స్థానిక నాయకులతో కలిసి వీధులన్నీ తిరిగారు. వన్నియర్ బ్లాక్ పరిధిలో వన్నియర్ బ్లాక్, బుచ్చిశెట్టి వీధి, గుర్రప్పనాయుడు వీధి, రేణుకాంబవీధి, పడవేటమ్మ వీధుల్లో పర్యటించి స్థానిక మహిళలతో మాట్లాడారు. స్థానికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ కాలువలు, దెబ్బతిన్న కల్వర్టర్ల సమస్యలపై స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అక్కడికక్కడే అధికారులతో చర్చించారు. తాగునీటి పైప్ లైన్లు ఎక్కువగా ఉన్నచోట ఒక్కటే పెద్ద పైపు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలువల్లో పూర్తిస్థాయిలో పూడిక తొలగించాలని, కల్వర్టర్లు, కాలువల నిర్మాణాలకు సంబంధించి టెండర్ ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. అనంతరం రంగాచారి వీధి వార్డు పరిధిలో సామిరెడ్డి వీధి, గోల్డ్ మార్కెట్, ఫిష్ మార్కెట్, కూరగాయల మార్కెట్, హాస్పిటల్ రోడ్డు బాణాల వీధిలో పర్యటించి పారిశుద్ధ్య పనులను, మురుగునీటి కాలువలను పరిశీలించారు. నగరంలో మురుగునీటి కాలువల్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని, పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. చిత్తూరు క్లీన్ సిటీగా తీర్చిదిద్దడంలో ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. గ్యాంగ్ వర్క్‌ల ద్వారా కాలువల్లో పూడిక తొలగించే పనులు చేయిస్తామని కమిషనర్ తెలిపారు.



నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న ఎంఎల్ఏ గురజాల

హామీల అమలు, సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత..

ఎన్నికల సందర్భంగా నగర ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే జగన్ మోహన్ చెప్పారు. వార్డుల్లో క్షేత్రస్థాయి పర్యటన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలపై వినతిపత్రం రూపంలో అందిస్తే తక్షణం చర్యలు తీసుకుంటామని అన్నారు. నగరంలో శుక్రవారం రెండు వార్డుల్లో పర్యటించి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. నగరంలో సమస్యల పరిష్కారానికి నగర కమిషనర్, అధికారులకు ఇప్పటికే సూచనలు ఇవ్వడం జరిగిందని.. వారు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇదే తరహాలో వివిధ రకాల సమస్యలపై రోజువారీగా క్షేత్రస్థాయి పర్యటనలు చేపడతామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కషి చేయాలన్నారు. ఈపర్యటనలో సహాయ కమిషనర్ రామకష్ణుడు, ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్ లోకనాథ్, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

'హామీలు 100 శాతం అమలు చేస్తాం'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీ మేరకు మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని అంశాలను 100 శాతం అమలు చేసి తీరుతామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజన్, చిత్తూరు, పూతలపట్టు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ తెలిపారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీపై నమ్మకం ఉంచి పార్లమెంటు, శాసనసభకు పోటీ చేసిన అభ్యర్థులకు ఘన విజయం అందించిన ప్రజలకు కతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు పెన్షన్ పెంపు, భూ సమగ్ర చట్టం రద్దు, మెగా డీఎస్సీపై సంతకం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లు తెలిపారు. మాజీ మేయర్ కటారి హేమలత, కోదండ యాదవ్, మోహన్ రాజ్, సురేంద్ర కుమారులు పాల్గొన్నారు.



క్యాబినెట్‌లో జిల్లాకు నో ఛాన్స్

ప్రజా'దృష్టి'


- టిటిడి నుంచే ప్రక్షాళన

ప్రజాశక్తి- తిరుపతి సిటి:

విభజన ఆంధ్రప్రదేశ్‌లో మూడోవ ప్రభుత్వం కొలువుదీరింది. రెండోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉమ్మడి జిల్లాకు చెందిన నారా చంద్రబాబు నాయుడు బాధ్యతులు చేపట్టారు. క్యాబినెట్‌లో ఉమ్మడి జిల్లాలో ఒకరంటే ఒకరికి కూడా అవకాశం దక్కలేదు. గత ప్రభుత్వంలోని ఆనవాలను మార్చి, బాబు మార్కును చూపేందుకు టిడిపి కూటమి టిటిడి నుంచే ప్రక్షాళన మొదలెట్టడం గమనార్హం.

క్యాబినెట్‌లో నో ఛాన్స్..!

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించి, తిరుపతి జిల్లాలో సైతం టిడిపి కూటమి క్లీన్‌సిప్ చేసింది. అందరు అనుకున్నట్లే చిత్తూరు జిల్లాకు చెందిన కుప్పం ఎంఎల్ఏ నారా చంద్రబాబు నాయుడే శాసనసభ కూటమి పక్షనేతగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు నాలుగోసారి, విభజన ఆంధ్రప్రదేశ్‌కు రెండోసారి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతులు చేపట్టారు. తనతో పాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కలిపి మరో 24 మందికి క్యాబినెట్‌లో చోటు కల్పించారు. కానీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 మంది ఎంఎల్ఏలలో ఒకరంటే ఒకరికి కూడా అవకాశం ఇవ్వలేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కుప్పం నుంచి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతులు చేపట్టడంతో ఆ జిల్లా నుంచి ఒకరు క్యాబినెట్‌లో ఉన్నా, తిరుపతి జిల్లా నుంచి ఒకరికి కూడా ఛాన్స్ ఇవ్వలేదు. చిత్తూరు జిల్లా నుంచి సీనియర్ ఎంఎల్ఏ, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డికి ఖచ్చితంగా మంత్రి పదవి వస్తుందని, కొత్తగా ఎన్నికైన వారిలో పూతలపట్టు ఎంఎల్ఏ కలికిరి మురళీమోహన్‌కు సీనియర్ జర్నలిస్టు అనుభవంతో, చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తినాని వీరిలో ఎవ్వరికో ఒకరికి అవకాశం వస్తుందని, తిరుపతి జిల్లా నుంచి టిడిపి సీనియర్ నాయకులు వెంకటగిరి నుంచి ఎన్నికైన రామకృష్ణకు, మాజీమంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కుమారుడు శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌కు అవకావం దక్కుతుందని భావించారు. తిరుపతి నుంచి ఎన్నికైన జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తనకు మంత్రి పదవి దక్కుతుందని ఆశపడ్డారు. పైగా జనసేన కోటలో సీమ నుంచి తనకు అవకాశం వస్తుందని భావించి, తీవ్రప్రయత్నలు చేశారు. కానీ ఆయనకు కూడా చుక్కెదురైంది. జిల్లా నుంచి తాను ముఖ్యమంత్రిగా ఉండగా మరెక్కరికి ఎందుకు అనుకున్నారో, రెండోసారి మంత్రివర్గ విస్తరణలో అవకాశం ఇద్దామని భావించాడేమో ఉమ్మడి జిల్లాలో ఎవ్వరికి క్యాబినెట్ అవకాశం ప్రస్తుతానికి దక్కలేదు.



టిటిడి నుంచి ప్రక్షాళన..

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజు సాయంత్రమే నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకుని శ్రీవెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. తిరుమల నుంచి తాడేపల్లికి చేరుకుని ముఖ్యమంత్రిగా బాధ్యతులు చేపట్టిన మరుసటి రోజే టిటిడి ఇన్‌చార్జ్ ఈవోపై తొలివేటు వేశారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమను ఇబ్బంది పెట్టిన అధికారులపై చర్యలు తీసుకునేందుకు పూనుకున్నారు. కక్షసాధింపులు ఉండవు అంటూ పైకి చెబుతునే తన మార్కును చూపించారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటీమి అభ్యర్థులు భారీస్థాయిలో గెలుపొందడంతో గత ప్రభుత్వం సానుభూతిపరుడుగా ఉంటున్న టిటిడి ఇన్‌చార్జ్ ఈవో ధర్మారెడ్డి తనను ఈవోగా రిలీవ్ చేయాలని సిఎస్‌కు విన్నవించారు. అందుకు ఆయన అంగీకరించలేదు. సిఎంగా బాధ్యతులు చేపట్టిన తర్వాత చంద్రబాబు తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తారని నిర్ధారణ కావడంతో బాబు వచ్చే సమయానికి ధర్మారెడ్డి తిరుమలపై ఉండకుడదనుకున్నారేమో.. ఆయన వారం రోజుల పాటు కండిషన్లతో కూడిన సెలవు మంజూరు చేశారు. స్వామివారి దర్శనాంతరం తిరుమలలో ముఖ్యమంత్రి స్థాయిలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో మార్పు తప్పదని, గత ప్రభుత్వ ఆనవాలను తుడిచిపెడుతామని, టిటిడి నుంచే ప్రక్షాళన చేపడుతామని ప్రకటించారు. ప్రకటించినదే తడువుగా తిరుమల నుంచి తాడేపల్లికి చేరుకున్న ముఖ్యమంత్రి అదేరోజు సాయంత్రం బాధ్యతులు చేపట్టారు. సచివాలయంలో ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారు. మరుసటి రోజు ఉన్నతాధికారులతో సమావేశానికి గంటే ముందే టిటిడి ఇన్‌చార్జ్ ఈవోగా ఉన్న ధర్మారెడ్డిని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో గత ప్రభుత్వంలో ఇష్టానుసారం వ్యవహరించిన అధికారులపై వేటు తప్పదని, లోకేష్ రెడ్‌బుక్ లిస్టులో ఉన్నవారిపై చర్యలు ఉంటాయని పరోక్షంగా హెచ్చరించారు. ఏది ఏమైన కూటీమి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వంలోని అధికారులపై చర్యలకు ఉపక్రమించారని, అందులో తొలి వికెట్ ధర్మారెడ్డి అని అధికారులు, ప్రజలు బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు తాజా మాజీ మంత్రులు, ఒక ప్రభుత్వ విప్ చెప్పినట్లు ఆడిన అధికారులపై చర్యలు తప్పవని, అందులోనూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాబోవు రోజుల్లో అధికమంది అధికారులపై చర్యలు ఉండబోతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రక్షాళన ఎక్కడికి ఎండ్ అవుతుందో వేచి చూద్దాం.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు : కలెక్టర్, ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ఈనెల 17న ఈద్–ఉల్–అజా (బక్రీద్) పండుగ సందర్భంగా ముస్లిం మతపెద్దలు, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రశాంత వాతావరణంలో జూన్17వ తేదీ బక్రీద్ పండుగను ముస్లిం సోదర సోదరీ మణులు అందరూ సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొను జంతువులను వధించిన, అక్రమంగా తరలించిన వారి పై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.. పశుసంవర్ధక శాఖ ద్వారా జిల్లా స్థాయి, గ్రామ పంచాయతీ స్థాయిలో జంతు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని మసీదుల వద్ద పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టేలా డిపిఓ, మున్సిపల్ కమిషనర్లకు తగు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ జిల్లాలో ఈద్ –ఉల్– అజా (బక్రీద్) పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భద్రత ఏర్పాట్లకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న పోలీస్‌శాఖ తరపున ఏఎస్పీ (అడ్మిన్) ఆరీఫుల్లాను నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని, సమస్యలను వారి దష్టికి తీసుకొని రావాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి.పుల్లయ్య, శిక్షణ కలెక్టర్ హిమవంశీ, ఏఎస్పీ (అడ్మిన్) ఆరీఫుల్లా, జడ్పీ సీఈఓ గ్లోరియా, పశు సంవర్ధక శాఖ జెడి ప్రభాకర్, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, చిత్తూరు ఆర్‌డిఓ చిన్నయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి, ఈడీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ హరినాథ రెడ్డి, డీపీఓ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

17న అన్న క్యాంటిన్ పునఃప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఈనెల 17వ తేదీన అన్న క్యాంటిన్‌ను పునఃప్రారంభించనున్నట్లు చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ తెలిపారు. గత ప్రభుత్వంలో మూతపడ్డ అన్న క్యాంటిన్‌లను తెలుగుదేశం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఐదు అన్న క్యాంటిన్‌లు ఏర్పాటు చేసి పేద, మధ్యతరగతి కార్మికులను భోజనవసతి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శనివారం స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మూతపడ్డ అన్న క్యాంటిన్ భవనాన్ని ఎంఎల్ఏ పరిశీలించారు. ఎంఎల్ఏతో పాటు మాజీ కార్పొరేటర్ యువరాజులు నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

అన్న క్యాంటిన్‌ను పరిశీలించిన కమిషనర్



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పురపాలక పరిధిలోని అన్న క్యాంటీన్ భవనాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి. రమణారెడ్డి పరిశీలించారు. పట్టణంలో అధిక జనసంచారమున్న ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలో అందరికీ అందుబాటులో ఉన్న అన్న క్యాంటీన్ భవనంను అసిస్టంట్ ఇంజనీర్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. అన్న క్యాంటీన్‌కు కావలసిన తాగునీరు, కరెంటు, సీసీ కెమెరాలు, ఇతర మౌలిక సౌకర్యాలను వెంటనే చేపట్టాలని అసిస్టంట్ ఇంజనీర్‌ను ఆదేశించారు.

నిరాశ్రయులకు అండగా ఉంటాం ..

డిఎల్ఎస్ఏ సివిల్ జడ్జి వెన్నెల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నిరాశ్రయులకు అండగా ఉంటూ ఉచిత న్యాయ సేవలు అందిస్తామని డిఎల్ఎస్ఏ సివిల్ జడ్జి వెన్నెల తెలిపారు. జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలోని న్యాయనికట్టు వీధిలో మెప్మా, నగరపాలక సంస్థ సహకారంతో సపోర్ట్ సంస్థ అధ్యక్షులు జోసఫ్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గహాన్ని శనివారం జడ్జి తనిఖీ చేశారు. అక్కడ నిరాశ్రయులకు అందుతున్న వసతులను గురించి అడిగి తెలుసుకున్నారు. నిరాశ్రయులకు సేవలు అందిస్తున్న జోసెఫ్ రాజును, సిబ్బందిని న్యాయమూర్తి ప్రశంసించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ ఇక్కడ ఉన్న నిరాశ్రయులకు వితంతువులకు ఉచితంగా న్యాయసేవలు అందిస్తామని తెలిపారు. వసతి గహ సిబ్బంది ప్రమీల, శ్రీనివాస, శశిరేఖ పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన మండల నేతలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

పుంగనూరు నుండి తిరుపతికి వెళుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎంపీపీ రెడ్డప్ప, వైసిపి రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి దామలచెరువు వద్ద కలిసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

17 నుంచి శ్రీ పద్మావతి అమ్మవారి

వార్షిక తెప్పోత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు జూన్ 17 నుంచి 21వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మసరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవాల్లో శ్రీ అలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమపూజలు అందుకుని భక్తులను అనుగ్రహిస్తారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజు ఆలయ మాడ వీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు. తెప్పోత్సవాల కారణంగా అమ్మవారి ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, జూన్ 21న లక్ష్మీ పూజను రద్దు చేశారు.

18న హథీరాం బావాజీ జయంతోత్సవాలు

తిరుపతి టౌన్ : తిరుపతి నగరంలో శ్రీహథీ రామ్ బావాజీ 595 వ జయంతి ఉత్సవాలు ఈ నెల 18వ తేదీ ఉదయం 8 గంటలకు హథిరాం బావాజీ విగ్రహం ఆలయ నిర్మాణానికి భూమి పూజ జరుగుతుందని ఆలయ ధర్మకర్త, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షులు భూక్య శివ నాయక్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు.

సంక్షేమం అతిముఖ్యం : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పోలీసు ఉద్యోగంతోపాటు వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ శనివారం చిత్తూరు ఏఆర్ పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్, ఎస్‌టిఎఫ్, బిడి టీమ్, డాగ్‌స్వాడ్, హోంగార్డు సిబ్బందితో పెరేడ్ నిర్వహించారు. పెరేడ్‌కి ముఖ్యఅతిధిగా జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు హజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బంది బాగోగులు గురించి, ఉద్యోగ ర్వహణలో వారు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు సిబ్బంది క్షేమంపరంగా సూచించిన అంశాలపై నివేదిక సమర్పించాలని, సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ ఏఆర్ ఉద్యోగ నిర్వహణ కష్టతరమైందని, భాద్యతాయుతమైందని వారు నిర్వహించే ఎస్కార్టులు, బందోబస్తులు, గన్‌మ్యాన్ ఉద్యోగం తగు జాగ్రత్తగా నిర్వహిస్తూ ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తగా ఉద్యోగ నిర్వహణ చేయాలన్నారు. అందుకోసం శారీరకంగా, మానసికంగా ధడంగా ఉండడానికి తగిన వ్యాయామం చేయాలని సూచించారు. ముఖ్యంగా ఏఆర్ పోలీసు సిబ్బంది క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాలని ఎలాంటి చెడు నడవడికకు ఆస్కారం ఇవ్వకుండా ఉద్యోగ నిర్వహణ చక్కగా నిర్వహించాలని హితవు పలికారు. పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించేటట్లు చేయడమే కాకుండా సిబ్బంది సంక్షేమం చూడడం కూడా తన కర్తవ్యమని ఉద్ఘాటించారు. అనంతరం ఆర్మ్ రిజర్వ్ ఆఫీస్‌లోని డ్యూటీ ఆర్ఎస్ఐ ఆఫీస్, బెల్ ఆఫ్ ఆర్మ్, బిడి టీం, మోటార్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్, డీఎస్పీ ఆఫీసులు, ఎస్‌టిఎఫ్ రూములు ఆర్మ్ రిజర్వ్ ఆఫీస్ పరిసర ప్రాంతాలను, ఇతర ఆఫీసులను తనిఖీ చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి..

13 నుంచి జులై 12 వరకు ప్రత్యేక ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ : డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

బడి ఈడు పిల్లలందరు బడిలోనే ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం ఉదయం డిఆర్ఓ చాంబర్‌లో డీఈవో దేవరాజులు, సర్వశిక్ష అభియాన్ పిఓ వెంకట రమణారెడ్డిలతో కలసి జిల్లాలో ఈనెల 13 నుండి జులై 12వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహణ కుసంబందించి స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన, బీసీ ఎస్సీ,మైనారిటీ సంక్షేమ శాఖలు, డిపిఓ. మెప్మా, కార్మిక శాఖలధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఆరు నుండి 14 సంవత్సరాల లోపు బాలబాలికలు అందరూ చదువుకోనాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నేను బడికి పోతా అనే కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయం చేసుకొని ఇంటింటికి వెళ్లి 6 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలు బడికి వెళ్ళుతున్నార లేదాని బడికి వెల్లుతూ మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి ఎవ్వరైనా ఉంటే వారిని సమీపంలో ఉన్న బడులలో చేర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా, మండల, గ్రామస్థాయిలో కమిటీలు నియమించాలన్నారు. జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికారి, ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కోఆర్డినేటర్ల ఛైర్మన్లుగాను, వివిధ శాఖలకు సంబంధించి 14మంది సభ్యులు ఉంటారని, మండల స్థాయిలో ఎంపీడీఓ ఛైర్మన్ గాను, ఎంఈఓ కన్వీనర్‌గాను, పది మంది సభ్యులు ఉంటారని, గ్రామస్థాయి కమిటీలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కమిటీ ఛైర్మన్ గాను, హెడ్మాస్టర్ కన్వీనర్‌గా, ఏడు మంది సభ్యులు ఉంటారని తెలిపారు. ఈ కమిటీలు ఈ నెల13 నుంచి జూలై 12వ తేదీ వరకు వారికి పరిధిలో ప్రత్యేక డ్రైవ్, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో డిపిఓ ఎస్.లక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ, సాధికారత అధికారి రబ్బానీ బాషా, సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి, గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.మూర్తి, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి చిన్నారెడ్డి, మెప్మా పీడీ రాధమ్మ, కార్మిక శాఖ నుంచి సహాయ కార్మికశాఖ అధికారి జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ బి.పుల్లయ్య

గంగాధరనెల్లూరు: బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇన్చార్జ్ ఎంపిడిఓ సుధాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీడీవో మీటింగ్ హాల్లో ఎంఈవో కాణిపాకం ఆంజినేయులుశెట్టి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేను బడికిపోతా కార్యక్రమంను ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరీలు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, సిఆర్పిలు, పార్ట్ టైం టీచర్స్‌తో కలిసి ఎన్రోల్మెంట్ డ్రైవ్ విజయవంతం చేయాలని కోరారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు




మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని కార్మికులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటూ అవస్థలు పడుతోందని వారి సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేంద్ర అన్నారు. శనివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించాలని లేబర్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్నపాపాన పోలేదని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాల విషయంపై కనీసం చర్చ కూడా లేదని, కొత్తగా ఎన్నికైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పట్టించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా సిఐటియు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేస్తున్నారని, ఎన్ని ఉద్యమాలు చేసినప్పటికీ ప్రజాపోరాటాలు చేసినప్పటికీ పాలక ప్రభుత్వాలు నిమ్మకునేరెత్తినట్లు ఉంటున్నాయని విమర్శించారు. కార్మికులకు, కర్షకులకు అన్యాయం తలపెట్టిన నరేంద్ర మోడీకి మెజారిటీ తగ్గడమే ప్రజలు హెచ్చరిక అని దీన్ని కేంద్రం గమనించాలని అన్నారు. ప్రజల పోరాటాలను కార్మికుల కర్షకుల పోరాటాలను చులకనగా చూస్తే భవిష్యత్తులో ఎలా ఉంటుందో ప్రజలు ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని ఇప్పటికైనా నరేంద్ర మోడీ కార్మికుల కర్షకుల జోలికి వ్యతిరేకంగా వెళ్ళకూడదని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు వి.గంగరాజు మాట్లాడుతూ కొంతమంది పాలకులు ప్రజలను బిచ్చగాళ్ళుగా చూస్తున్నారని, ప్రజలకు డబ్బులు ఇస్తే అధికారం ఇస్తారని అనుకోవడం భ్రమ అని, ప్రజలే బుద్ధి చెప్పారని అన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు చిత్తశుద్ధితో పనిచేస్తే 10 కాదు 20 కాదు 30 సంవత్సరాలు అయినా అధికారం అప్పగిస్తారని అది కమ్యూనిస్టులకే సాధ్యమైందని అన్నారు. కార్మికులకు కార్మిక చైతన్యమే కాకుండా రాజకీయ చైతన్యం కూడా ఉండాలని వివరించారు. గిరిధర్ గుప్తా మాట్లాడుతూ సిఐటియును చిత్తూరు జిల్లాలో బలంగా విస్తరించేలా అందరు కషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షకీలా, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి, వీవోఓ సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, అంగన్వాడీ యూనియన్ నాయకులు శోభ, ఎర్రమ్మ, కల్పన, ధనకోటి తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- వి కోట



మండల పరిధిలోని దాసార్లపల్లి సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామకుప్పంకు చెందిన అబ్దుల్ రోఫ్ (30) మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ద్విచక్ర వాహనంలో శనివారం వ్యక్తిగత పనులపై వీకోట వైపు వస్తుండగా దాసార్లపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు సిలిండర్ల లారీ ఢీకొంది. ఈ సంఘటనలో అబ్దుల్ తలకు బలమైన రక్తగాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మరణించాడు. విషయం తెలుసుకున్న వీకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించారు. మతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన

18 మందికి జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు శుక్రవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 18 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో శనివారం ఉదయం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించగా మొత్తం రూ.1,80,000ల జరిమానాను వాహనదారుల నుంచి వసూళు చేశారు. ఈ 7నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 223 మందికి రూ.16 లక్షల జరిమానాలు విధించడం జరిగిందన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేకుంటే భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు.

టిడిపి నాయకునిపై ఫిర్యాదు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు వెంకటేష్ సచివాలయ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడానని సచివాలయ సిబ్బంది పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టిడిపి నాయకుడు వెంకటేష్ కుటుంబానికి గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందలేదని, ఇప్పుడు టిడిపి అధికారంలోకి వచ్చింది తమకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని లేకుంటే మీ ఉద్యోగులు తీయిస్తానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు సచివాలయ సిబ్బంది ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా అక్కడే ఉన్న చవనపల్లె గ్రామానికి చెందిన దామోదర్ రెడ్డి సద్దిచెప్పే ప్రయత్నం చేయడంతో అతన్ని చెప్పుతో కొట్టాడని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కార్వేటినగరం సిఐ సత్తిబాబు కేసు నమోదు చేసి వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.




పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సురేష్ బాబు మృతికి ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నింద్ర ఉన్నత పాఠశాలకు చెందిన గణితం ఉపాధ్యాయులు సురేష్ బాబు శనివారం గుండెపోటుతో మరణించారు. ఆయన భౌతిక కాయంను నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

శిలాఫలకాల ధ్వంసంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గుర్తు తెలిని వ్యక్తులు ధ్వంసం చేసారంటూ ఎంపిపి రెడ్డప్ప పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ఫలితాల తరువాత మండలంలోని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పిహెచ్‌సిల నిర్మాణాలు, సిసి రోడ్లకు సంబంధించిన ప్రతిష్టించిన శిలాఫలాకాలను సైతం ధ్వంసం చేశారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



రాజీవ్‌నగర్‌లో అవినీతి ప్రక్షాళన

• రహదారి ఆక్రమణలపై తొలి దెబ్బ

• దొంగే దొంగన్న రీతిగా 'రెవెన్యూ'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అవినీతి ప్రక్షాళనకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి నడుం కట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అవినీతిపై కొరడా జులుపించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా రాజీవ్ నగర్‌లో రహదారి ఆక్రమణలపై మొదటి దెబ్బ వేశారు. ఎమ్మెల్యే ఆదేశాల వరకు శనివారం రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా రాజీవ్ నగర్ రహదారి ఆక్రమణలపై దష్టి సారించింది. ఆర్డీవో రవిశంకర్ రెడ్డి నేతత్వంలో రెవెన్యూ యంత్రాంగం జేసీబీల సాయంతో రాజీవ్ నగర్‌లోని శ్రీకాళహస్తి–పిచ్చాటూరు రహదారి వెంబడి అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు పూనుకున్నారు. మూడు పునాదులను ధ్వంసం చేసిన అనంతరం అక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టిన వ్యక్తుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఈ స్థలాలపై తమకు పూర్తి హక్కులు ఉన్నాయనీ, రెవెన్యూ అధికారులు పట్టాలు, అనుభవ పత్రాలను ఇచ్చారని ఆ వ్యక్తులు అక్రమణలను తొలగించడానికి వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. తమకు అన్ని హక్కులు ఉన్నాయి కనకే విద్యుత్ శాఖ అధికారులు కరెంటు మీటర్లు, విద్యుత్ సర్వీసులు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ స్థలాలను తాము లక్షలు పోసి కొన్నామనీ, లక్షలు పెట్టి నిర్మాణాలు చేశామంటూ వాపోయారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఎలా తొలగిస్తారంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో రాజీవ్ నగర్ లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాజీవ్ నగర్ రహదారి వెంబడి దుకాణ నిర్మాణాలు చేపట్టిన ఓ వ్యక్తి అయితే గదిలోపల తాళం పెట్టుకుని తన దుకాణాన్ని ధ్వంసం చేయకుండా అడ్డుకోవడం గమనార్హం. దీంతో రెవెన్యూ యంత్రాంగం చేసేదేమీ లేక మీ వద్ద ఉన్న ఆధారాలు ఏంటో ఆర్డీవో కార్యాలయానికి తీసుకొచ్చి చూపాలని చెప్పి వెనక్కి వెళ్లారు. అయితే సాయంత్రం తిరిగొచ్చి 80 శాతం ఆక్రమణలను కూల్చేయడం గమనార్హం.

దొంగే దొంగన్న రీతిగా 'రెవెన్యూ'

దొంగలు పడ్డ ఆర్నెళ్లకు అవేవో మొరిగినట్టు..దొంగే దొంగ అన్న రీతిగా రాజీవ్ నగర్ రహదారి ఆక్రమణల పై రెవెన్యూ అధికారుల తీరు ఉందన్న విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో గడిచిన రెండేళ్లుగా రాజీవ్ నగర్ లో ఎన్నో అక్రమ నిర్మాణాలు యధేచ్ఛగా కొనసాగాయి. ఆక్రమణలు జరిగిపోయాయి. ఎన్నో వివాదాలు, గొడవలు, దాడులు, ప్రతిదాడులు జరిగాయి. అయితే ఇవేవీ తమకు తెలియదనీ, తమ వరకు రాలేదనీ, మాకు సమాచారం లేదనీ, తమకు సంబంధం లేదని రెవెన్యూ అధికారులు తామరాకుపై నీటి బొట్టులా వ్యవహరించారు. ప్రభుత్వం మారడంతోనే అక్రమ నిర్మాణాలంటూ కేకలు పెడుతున్నారు. రోడ్డు పొరంబోకు, కాల్వ పొరంబోకు అంటూ పొలికేకలు పెడుతున్నారు. గత మూడేళ్లుగా ఎంతోమంది ఫిర్యాదులు చేసినా ఏ మాత్రం పట్టించుకోలేదు. శ్రీకాళహస్తి పట్టణానికి సంబంధించిన రాజీవ్ నగర్ కథ ఇది. గత ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని స్థానిక నాయకులు, కార్యకర్తలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్న విమర్శలు ఉన్నాయి. ఇవన్నీ అధికారుల అండతో జరిగాయనేది బహిరంగ రహస్యం. ప్రభుత్వ స్థలాలను అనధికారికంగా అమ్మకాలు చేశారు. కోట్ల రూపాయలు సంపాదించుకున్నారు. పనిలో పనిగా పేదవారి స్థలాలపై కూడా కన్నేశారు. బాధితులు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. వైసిపి ప్రభుత్వం పోయి టిడిపి ప్రభుత్వం రావడంతో అధికారులకు చట్టాలు, నిబంధనలు వెంటనే గుర్తుకు వచ్చేసాయి. ఆర్డీవో స్థాయి అధికారి కూడా ఇక్కడే ఉన్నారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు తహశీల్దార్లు, డీటీలు, ఆర్ ఐలు, వీఏర్వోలు అందరూ ఉన్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. పేదల బాధలను వినే ఓపిక, తీరిక కూడా వారికి లేకుండా పోయింది. ఎన్నికల సమయంలో విచ్చల విడిగా పట్టాల అమ్మకాలు జరిగాయి. స్థలాలను ఆక్రమించారు. ఎన్నికల సమయంలో పట్టాలిచ్చిన అధికారులెవరు...? పట్టాలపై ఏ అధికారి సంతకాలున్నాయి...? నిజమైనవా..? నకిలీవా...? అన్న సంగతి ఇప్పుడైనా తెలుస్తారా..?లేదా..? చూడాలి మరి.



రాజీవ్‌నగర్‌లో ఆక్రమణల తొలగింపు

స్విమ్స్‌లో రాష్ట్రస్థాయి వార్షిక సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో జూన్ 14, 15 తేదీల్లో శ్రీ పద్మావతి వైద్య కళాశాల లెక్చరర్ గ్యాలరీ –1లో రాష్ట్రస్థాయి నాలుగో వార్షిక సదస్సు రెండు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు, 200 మంది డెలిగేట్స్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి ఛైర్మన్ డాక్టర్ క్రిష్ణ సింహారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎమర్జెన్సీ మెడికల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాష్‌బాబు, డాక్టర్ రోహిత్‌గుప్తా పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మోహన్ బర్త్‌డే వేడుకలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి మాజీ శాసనసభ్యులు అంతరాజి మెహన్ స్వగహంలో ఆయన జన్మదిన వేడుకలను రాష్ట్ర బలిజసేన అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శాలువాకప్పి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బలిజసేన అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ మోహన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎంతోమందికి ఉపాది కల్పించారని, పేదలకు తనవంతు సహాయం చేసేవారన్నారు. నాయకులు బెల్లంకొండ సురేష్, చేరుకుల నీలాద్రి, ప్రకాష్ బాబు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

ప్రజాశక్తి- గంగవరం:

మండలంలోని జీడిమకనపల్లి గ్రామానికి చెందిన 100 మంది తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం తిరుమల పాదయాత్రకు బయలుదేరారు. వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం గ్రామస్తులు తిరుమలకు వెళ్లి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి, పలమనేరు నియోజకవర్గంలో అమరనాథరెడ్డి శాసనసభ్యునిగా గెలుపొందాలని మొక్కుకున్నామని ప్రస్తుతం తమ కోరిక నెరవేరడంతో గ్రామస్తులు తిరుమలకు పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు.